


# ముమ్మూర్తి

**రావి. కొండలరావు**

అర్ధరాత్రి వేళ–నడివీధికి ఎడమప్రక్కగా పాతుకుపోయివున్న ఎలక్ట్రిక్ స్తంభానికి ఆనుకుని, కుడిచెయ్యి పైకెత్తి తల(కింద పెట్టుకుని, ఎడమకాలు పైకి మడిచి స్తంభానికి ఆని– నించునివున్నవాడు "గమ్మూర్తి" అని చెబితే ఎవరూ నమ్మరు. కాని–అవును– అతను మూడు మూర్తులా అక్షరాలా రామ్మూర్తే! ఆ వేళప్పుడు రామ్మూర్తిని గనక ఎవరన్నా అక్కడ చూస్తే – అతను బ్రతికే వున్నా దెయ్యాన్ని చూసినట్టు భయపడేవారేమో! ఎందాకంటే ఏ రాత్రీ తొమ్మిది దాటితే గుమ్మం దాటనివాడూ గుమాస్తా ఉద్యోగం చేస్తూ పిల్లాజెల్లాతో జీవితం వెళ్ళబుచ్చుకుంటున్నవాడూ అయిన రామ్మూర్తి ఇట్లా అర్ధరాత్రివేళ–వీధి నిశ్శబ్దంలో పడి నిర్మానుష్యమైనాక – ఎలక్ట్రిక్ స్తంభానికి ఆనుకుని బల్లిలాగా అంటుకుని, నించుని వున్నాడంటే ఎవరికన్నా ఆశ్చర్యం వేస్తుంది! ఐతే రామ్మూర్తి నిజంగా అంటుకుపోలేదు – ఆలోచనాపరుడై అరగంటసేపోయి అట్లా ఒంటికాలుమీద తపస్సు చేస్తున్నాడు!

సాధారణంగా అందరికీ కలుగుతున్నట్టే రామ్మూర్తికీ జీవితంమీద విరక్తి కలిగింది. 'ఎందుకు బ్రతకాలి?' అని ఓ

మన్నికగల
అశోకా'వివేక్
కలములనే
వాడండి.



అశోకా,
పెన్ వర్క్సు
తెనాలి

తరచుగా
మూత్రవిసర్జన

తరచుగా మూత్రము వెలువడుట మిక్కిలి ప్రమాదకరమైనచిహ్నము. శరీరాన్ని గుల్లచేయకమేకాకుండా యీ వ్యాధి, తనబంధంలో చిక్కినవారిని అరోజాకారోజు మృత్యువుకు అపన్నుని చేయును. ప్రథమదశలో శారీరక మానసికశ్రమను అతి అధ్యగించకుండుట, నడుములో నొప్పి చూపు మాంద్యము, కొడల్లో తిమ్మిరి, నరముల బలహీనతతో యీ వ్యాధి పొడచూపును. పై లక్షణములతోకూడిన వ్యాధికి వెంటనే తగిన చికిత్స చేయించకున్నచో, అధికదాహం, ఆకలి, గొంతు నోరు యెండుట, దురదలు, కాళ్ళలో వాపు, వొళ్లు తూకంతగ్గటం, శరీరమంతా పోట్లు, కీళ్ల నొప్పులు, కంటిపొరలు, క్షయ, గడ్డలు, రాచపుండ్లు, యిట్టి భయంకర బాధాకరమైన వ్యాధులు ఎన్నో సంభవింపవచ్చును

"వీనస్ ధారమ్" మాత్రలు వాడి, అనేక వేలమంది శమబాధల నుండినివారణపొంది మృత్యుకబళముమండి రక్షింపబడిరి, "వీనస్ ధారమ్" శాస్త్రీయ పద్ధతులమీద, ప్రాచీన యూనానివైద్య విధానప్రకారం అమూల్య ఓషధుల శాకపదార్ధముల, క్షారాదిక క్షారముల సారముతో తయారైనవి. "అమిత దాహం తగ్గి.... పలుమారు మూత్రవిసర్జనచేయు అవసరము, 2 లేక 3 రోజులలోనే మీకు చాలాభాగము నివారణగును కొద్ది రోజులలోనే మీకు సగానికిపైగా స్వస్థత చేకూరినట్లనిపించును. "వీనస్ ధారమ్" కొద్ది వ్యయముతో, సుఖముగా, తేలికగా సేవించవచ్చును. దీనికి ప్రత్యేకపథ్యము లేదు. నిరాహారముతో నుండే అవసరంలేదు. రోగులు పుష్టికరమైన అహారము తినేందుకై రోగులు యిదివరకటికంటే మిక్కుటవరకాల ఆహారపదార్థములు తినకొనవచ్చును వివరములు గల ఇంగ్లీషు కరపత్రములు అడిగినచో ఉచితముగా పంపబడును

ధర: 50 మాత్రల సీసా రు. 6-75
ప్యాకింగు పోస్టేజి ఉచితము.
లభించు స్థలము:
VenusResearch Laboratory (A.P.W)
P. O. Box No 587, Calcutta

# ★ ముమూర్ష ★

ప్రశ్న. 'చావటానికే నా?' అని తనే తిరిగి ప్రశ్న. 'చావటానికే అయితే బ్రతకటం ఎందుకూ?' అనే పాత పాటే సమాధానం! ఈ రకం వైరాగ్యంలో పడి రామ్మూర్తి ఆరునెల్లయింది. ఆరునెల్ల క్రిందట ప్రారంభించిన ఈ వైరాగ్యం దినదిన ప్రవర్థమానమై ఈనాడు అర్ధరాత్రివేళ అతన్నిట్లా ఇల్లుదాటించి, ఈ ఎలక్ట్రిక్ స్తంభానికి చేరబెట్టింది! ఎక్కడినుంచో వస్తూన్న కారులైటు రామ్మూర్తి మొహంమీదపడి, కళ్ళమ్మట కారబోతున్న నీటి చుక్కలను తళుక్కుమనిపించింది. రామ్మూర్తి తల దించుకున్నాడు. తన తలపై వున్న ఎలక్ట్రిక్ దీపం వెలుగుతూనే వుంది — ఈ వేళప్పుడు తనను ఎవరన్నా చూస్తారేమోనని తలను ఇంకా దించుకున్నాడు — అంత విరక్తిలోనయినా ఆత్మాభిమానం అనేది చావక! ఆ దించుకోటంలో అతని చూపు అక్కడున్న ఓ కుక్కపై పడ్డది. ఆ కుక్క రామ్మూర్తిని అదే చూడటం! ఐనా, అతనితో పాత పరిచయం వున్నట్టుగా అతన్ని చూసి చిరునవ్వునవ్వింది. రామ్మూర్తికి తిరిగి నవ్వే వోపికా లేదూ, పైగా నవ్వాల్సిన అగత్యమూ కనిపించలేదు.

"భోంచేశావా?" అన్నది కుక్క తను నాకేసిన ఎంగిలాకు చూసుకుంటూ.

"నా మొహం. నేను తినను" అన్నాడు రామ్మూర్తి.

"ఏం — అలిగావా ఏమిటి?" అంది కుక్క.

"జీవితంమీద"

"నీకంతే తెలుసులే. జీవితంమీద అలిగేటంతటి మూర్ఖులు మీ మనుషులకంటే ఎక్కడా వుండరు. ఎందుకయ్యా అంత నిరుత్సాహం — వున్నదేదో తినివుండక —" అని లేచి వెళ్ళిపోయింది కుక్క వొళ్ళు విరుచుకుంటూ.

"నువ్వు అదృష్టవంతురాలివి!" అనుకున్నాడు రామ్మూర్తి — అది వెళ్ళిపోతూ వుంటే చూస్తూ. కుక్కలకు విరక్తులు కలగవు — జీతాలు చాలకపోవటాలూ, ఇంట్లో ఇబ్బందులు కలగటాలూ, పై ఆఫీసర్లు తిట్టటాలూ — ఇవేవీ వుండవు. మనిషి జన్మకంటే కుక్క జన్మ నయం! పైగా దానికి 'విశ్వాసం' అనే గుణం కూడా ఒకటున్నది — అని తెలుసుకున్నాడు రామ్మూర్తి.

రామ్మూర్తి కళ్లు తుడుచుకుని కుక్కను అనుసరించాడు. ఆ కుక్క అట్లాగే పోయి, ఆకులకోసం వెతికింది. ఏమీ కనిపించలేదు. 'రామా కృష్ణా' అనుకుని హోటలు అరుగుమీద నడుం వాల్చింది. 'ఈ కుక్క ఆశాజీవి. దీనికి వున్న ఆశయినా తనకులేదా?' అనుకున్నాడు రామ్మూర్తి. 'లేదు' "వొద్దు" అని కూడా అనుకున్నాడు వెంటనే.

రామ్మూర్తి ఏడుస్తున్నాడు. ముప్ఫైఏళ్ల రామ్మూర్తి, జీవితంలో సగంభాగం అయినా అనుభవించని రామ్మూర్తి, పెళ్లామూ బిడ్డలూ స్నేహితులూ, వుద్యోగమూ గల రామ్మూర్తి — బ్రతుకుమీద అసహ్యం కలిగి, బ్రతకటం చాతకాక — ఏడుస్తున్నాడు! బ్రతకటం చాతకావటం సులభం కాకపోయినా, బ్రతికే మార్గాన్ని సౌలభ్యం చేసుకోవటం కోసం రామ్మూర్తి ఆలోచించలేదు! మూడునెల్లయి అతను చాలా కష్టాల్లో వున్నాడు. 'అప్పులు' అనే ప్రవాహంలో గొంతుదాకా మునిగివున్నాడు. ఈ ప్రవాహం ఎప్పుడు ఉధృతం అయి, తనను పూర్తిగా ముంచేస్తుందో రామ్మూర్తి వూహాకందలేదు! ఇంట్లో నలుగురు పిల్లలు — తల్లి — భార్య. తన సంపాదన తక్కువ. వీటన్నిటికీ తోడు ఆఫీసులో అయ్యగార్ల తిట్లూ, దీవెనలూ నిత్యమూ వుండేవే. ఏ క్షణమో ఈ వుద్యోగము వూడిపోయి, ఈ సంపాదనకూడా లేకుండా పోతే, తనకెవరు దిక్కు? ఎక్కడా ఎవడూ కనిపించడు!

తన సంసారం తను చేసుకోవటం, తన బ్రతుకు తను బ్రతుక్కోటం రామ్మూర్తికి దుర్భరమైపోయిం . ఎవడినో ఉద్ధరించి పట్టు! నాలుగు రోజుల్నుంచీ కొంపలో బియ్యమూ లేవు — తన జేబులో 'పైసా' లేదు. ఇవాళ ఆఫీసులో 'కాస్త అడ్వాన్సు పెట్టండర్రా' అంటే మేనేజరు తిట్టాడు. నానా మాటలూ అన్నాడు. "ఎన్నాళ్లని అడ్వాన్సులు? ఇదేం నీ మామగారి ఇల్లా?" అనికూడా అన్నాడు. అడ్వాన్సు ఇవ్వకపోతే ఇవ్వను అని చెప్పాలి గాని — తనను తిట్టటానికీ, ఈ ప్రసక్తిలో తన మామగారిని తీసుకురావటానికీ ఈ మేనేజరుకు అధికారం ఎవడిచ్చాడో రామ్మూర్తికి అర్థంకాలేదు. కాయితాలువిసిరేసి బయటపడ్డాడు. ఇంటికి పోలేదు. పోతే ఏముంది? వచ్చిన అప్పుల వాళ్ళ లిస్టు చెబుతుంది భార్య — కొంపలో లేని సామాన్ల లిస్టు చెబుతుంది తల్లి. కేవురు కావురుమని రాగాలుపెడుతూ దొర్లుతూ వుంటారు సంతానాలు! ఈ 'దిక్కుమాలిన కొంప'కుపోవటంకంటే, వీధి ఎలెక్ట్రిక్ స్తంభానికి ఆనుకోవటమే ఉత్తమంగా తోచింది రామ్మూర్తికి. ఈపాటికి ఇంట్లో అంతా నిద్రలు పోతూవుంటారు 'ఆకలి'బాధలతో. వాళ్ళకు నేనేం పెట్టను? స్నేహితుడన్న ప్రతీవాడూ తనకు కనీసం నాలుగు అణా

లన్నా అప్పు ఇచ్చాడు ఇంకెవరిని అడగాలి? కొత్త స్నేహితుల్ని సంపాయించాలి— అడగాలి! 'ఛీ! ఇది జన్మేనా—కాదు—కర్మ!' అనుకున్నాడు రామ్మూర్తి ప్రాపద్ధంగా.

రామ్మూర్తి కళేబరం కదిలింది. సంధు దాటి ఒక పదిహేను గజాలు వచ్చింది. ఎవరింట్లోనో రేడియో పాడుతోంది. వీధిలో కుక్కలు మొరుగుతున్నాయి. ఒకటి రామ్మూర్తిని చూసి మొరిగింది. 'ఛా—వెధవ కుక్క. దీనిజోలికి పోయినట్టు, నా మీదెందుకూ ఈ మొరుగూ?' అని కోప్పడి అక్కడినుంచి దూరంగా తప్పుకున్నాడు నిశ్శబ్దంగా నిరుత్సాహంగా నిశ్చలంగా దారకష్టంగా నిలుచుంది ఓ గాడిద. 'నన్ను చూసి గాడిదకూడా తప్పుకోదు' అనుకున్నాడు రామ్మూర్తి

"ఏమిటి బ్రదర్, గొణుగుతున్నావ్?" అన్నది గాడిద. రామ్మూర్తి వినిపించుకోలేదు. నిరసంలోనే శక్తిని తెచ్చుకుని చరచరా నడిచాడు బీచివొడ్డుకు ప్రశాంతికోసం.

ఈ సముద్రం ఎన్ని సంవత్సరాలనుంచో ఇట్లా వున్నదట! దీనికి జీవితంమీద విరక్తి కలగదుగదా! సంసారం చెయ్యాలనే తాపత్రయం కూడా అక్కర్లేదుకదా— 'ఓ భగవంతుడా! నన్ను కనీసం ఈ సముద్రంలో ఒక నీటిచుక్కగానైనా ఎందుకు పుట్టించావు కాదు!' అని అడగాడు నిలవేసి దేవుడిని—గాల్లోకి చూస్తూ. ఏ దేవుడూ సమాధానం చెప్పలేదుగాని — సముద్రపు హోరుమాత్రం, 'దానికెంత పుణ్యం చేసుకోవాలి!' అని అన్నది.

రామ్మూర్తి ఇసుకలో కూలబడ్డాడు. ఎదురుగావున్న సముద్రంలో లేస్తున్నట్టే అతని తలకాయలోనూ కెరటాలు లేవసాగినయి. ఆ కెరటాలు ఉత్సాహంగా ఉరకలు వేస్తూవుంటే ఇవి నిరుత్సాహంగా దిగులుగా రామ్మూర్తికి జీవితంమీద జుగుప్సను కలిగిస్తున్నయ్.

రామ్మూర్తి ఒకటే నిర్ధారణ చేసుకున్నాడు. 'తను చావాలి—' అదొక్కటే మార్గం! చచ్చి తను సాధించేది ఏం లేకపోయినా, బ్రతికి సాధించేది ఏమీ లేదు. కాబట్టి, చావటమే సుఖం! కాని, తనవాళ్ళంతా ఏమవుతారు? ఏదోవిధంగా వాళ్ళు బ్రతుకుతారు—కనీసం చావలేకనన్నా. ఐనా, చచ్చేముందు కూడా తనకు ఈ చుటరికాలు ఎందుకు? ఇవేగా తనను ఇట్లా చేసినై?...ఛీఛీ...!

అలసిపోయిన రామ్మూర్తి కళేబరం నిద్రలో పడిపోయింది. నిద్రలోకూడా రామ్మూర్తి 'చస్తేనే నయం' అని కలవరించాడు. కొన్నేపటికి రామ్మూర్తి వులిక్క—


ఆయుర్వేదౌషధములు.
శాస్త్రీయముగాను, నమ్మకముగాను తయారుచేయు సంస్థ
వేంకటేశ్వర ఆయుర్వేదనిలయం.
—చింతలూరు.—
ఆలమూరు పోస్టు ★ తూర్పుగోదావరిజిల్లా.
ఆంధ్రదేశమందంతటను బ్రాంచీలు, ఏజన్సీలు కలవు.
సికింద్రాబాదు బ్రాంచి: 7-2-148 [illegible]





పూవు మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, మీ సరియైన దర్యనుగురించిన్నీ మీరు తెలుసుకోవగోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన మీకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, మీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపండి.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసిన తేదిలగాయతు 12మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు. జీవితమార్గము. ఏ వ్యవహారములో మీకు జయముకలుగునో, మీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, విధివిక్షేపములు, లాటరీ, అకస్మాద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మూసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జిలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్న యెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన ఫోకటా మీకు తృప్తిగా నుండనియెడల సొమ్ము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt. DevDutt Shastri, Raj Jyotishi (WP-13) Jullundur City.



PAKCO పాకో స్లో-స్పీడ్, కోల్డు స్టార్టింగ్ క్రూడ్ ఆయిల్ ఇంజనులు

—: ప్రత్యేక లక్షణములు :—

* పనిచేయ ప్రారంభించుట తేలిక
* తక్కువ ఇంధన ఖర్చు
* క్రమమైన నడక
* దిట్టమైన నిర్మాణం
* ఎక్కువ మన్నిక
* అద్భుతంగా పనిచేయును



* బాష్ ఫ్యూయల్, ఇంజక్షన్ పరికరములు


మద్రాసు ఆంధ్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రములకు ఏజెంట్లు

Grams: "LAMP" K. S. SHIVJI & CO., (Estd. 1903)

Phone: 3617 పోస్టు బాక్సు నెం. 5, 178-79 బ్రాడ్వే, మద్రాసు-1.

గరం మసాలా పౌడరు
(Madras Curry Powder)
సిద్ధంగా నున్నది.
టొమాటో సూప్
(వేడి నీటితో, వేడి పప్పుకట్టుతో కలపండి)
మిరియాల రసము : పౌడరు, పేస్టు,
(వేడినీళ్లతో కలుపండి.)
ఊరగాయలు అనేకరకాలవి,
వడియములుకూడా ఉన్నవి.
ri GANESRAM&CO.,MADRAS-1.
నమ్మకమైనఏజెంట్లుఆంధ్రప్రదేశ్ లో కావలెను


నారసింహ లేహ్యము
బంగారుతో చేరినది. మేహము,
బలహీనత, విస్మృతి వగైరా పోగొట్టి
బలము రక్తవృద్ధి కల్గించును 20 తు
డబ్బీ రు 3 8 0 పోస్టేజీ రు 1-1-0
ఏ. వి. వి. అండ్ కంపెనీ ఆయుర్వేద వసూతం.
పెరిడేపి (PO) నెల్లూరుజిల్లా.


జోక్సు
నవ్వించి నవ్వించే
హాస్యరసమాసపత్రిక
విడిప్రతి • సం చందా
25 న పై 3 రు
అన్నిచోట్ల డిపాజిట్స్
కట్టగలఏజంట్లుకావాలి
వివరములకు : మేనేజర్, "జోక్సు" గుంటూరు-2

నంజన్‌గూడు పండితవాదివారి
జ్వరేగ్
సకల జ్వరములను అద్భుతముగా నివారించును.
క్యాటలాగ్ ఉచితము
హోల్ ఏజంట్లు యునైటెడ్ ట్రేడర్స్, మదరాసు-1

పండిత
డి. గోపాలాచార్యులవారి
అరుణా
స్త్రీల టానిక్
ఆయుర్వేదాశ్రమం(ప్రైవేట్)లిమిటెడ్
మద్రాసు 17

# ★ ముముర్ష ★

పడి, లేక లేచి, అకాత్తుగా లేచి కూచున్నాడు. మెడకం వొచ్చింది! తానెందుకు ఇక్కడ ఇంకా పడివున్నాడు—పోయి చాక! చచ్చేందుకు మార్గం లేదా?—నవకటిక ఎవడో నది చుట్టూ పరిగెత్తుతూ 'త్రాగటానికి నీళ్ళో' అని అరిచాట్ట! అట్లాగా, ఎదురుగా బ్రహ్మాండమైన సముద్రాన్ని పెట్టుకుని చావటానికి మార్గం లేదన కోవటం ఏమిటి!—మతి పోయింది. అతని కళేబరం లేచింది—సముద్రం కేసి నడిచింది—ఆగింది— దూకుదామనుకుంది — ఆగింది—నాలుగు అడుగులు ముందుకు వేసింది—మళ్ళీ ఆగింది! ఆకాశంమీద మిలమిలా మెరుస్తున్న ఓ నక్షత్రం ఈ వ్యవహారం చూసి పకపకా నవ్వింది.

"ఎందుకా నవ్వు సిగ్గులేక?" అన్నాడు రామ్మూర్తి ఉక్రోషంగా.

"నీకు ధైర్యం లేక" అన్నది తార.

"చావటానికి ధైర్యంకూడా కావాలా?" అన్నాడు రామ్మూర్తి తిరిగి.

"పిచ్చివాడా! దానికే కావాలి ధైర్యం!" అన్నది చుక్క.

"ఐతే నేను పిరికివాడినా—నాకు ధైర్యం లేదూ?"

"ధైర్యమే వుంటే బ్రతికేవాడివేగా" అన్నది తార.

"బ్రతుకు మాట నువు చెప్పకు. దాని కష్టసుఖాలు ఎక్కడో వున్న నీకేం తెలుసు?—ఓ దేవుడా! కనీసం నన్ను ఈ నక్షత్రాల్లో నయినా ఒకటిగా ఎందుకు చేశావు కావయ్యా?" అన్నాడు రామ్మూర్తి.

ఐతే రామ్మూర్తి ఆ రాత్రి చావలేదు. ఆ సముద్రం తనను చంపుతుందని అతనికి నమ్మకం కలగలేదు. తీరా పడ్డాక, వొడ్డుకు కొట్టుకువచ్చేస్తే? లేదా, ఏ రాజకుమారున్నా అకాత్తుగా అడ్డుపడి రక్షించేస్తే?—అనుకున్నాడతను. ఏమయినా చావడానికి సముద్రం మంచి సాధనం కాదని తీర్మానించుకున్నాడు. పాత చోటులోనే ఇసుకలో విశ్రమించాడు. ఎవడన్నా భావాలు వచ్చి తనను 'ఆత్మహత్య' చేసెయ్యరాదూ?' అనుకొన్నాడు దూరంగా ఏదో అలికిడైతే.

రామ్మూర్తికి భార్య జ్ఞప్తికి వచ్చింది. తనతో పాటు ఇన్నాళ్ళూ కష్టాలు భరించిన ఉత్తమ ఇల్లాలు! తల్లి గుర్తువచ్చింది. బిడ్డలంతా వరసనా నించున్నారు. దివ్యదృష్టితో వాళ్లందర్నీ ఓసారి చూసుకున్నాడు రామ్మూర్తి.

తెల్లవారబోతున్నది. మళ్ళీ మామూలు ప్రపంచం ప్రారంభం కాబోతోంది. కాఫీలూ, హోటళ్ళూ, ఆఫీసులూ, ఆఫీసర్లూ, తిట్లూ, రైల్‌మిషన్లూ—అన్నీ మళ్ళీ మామూలు వీటికి ఈ సముద్రంలాగా అంతే లేదు. ఇవన్నీ జ్ఞాపకం రాగానే రామ్మూర్తి భయపడ్డాడు. 'ఈ లోకానికి తెల్లవారకుండానే తను చచ్చిపోవాలి' అనుకుంటూ బయల్దేరాడు. కొంపదీసి ఇటా 'చచ్చిపోవాలి చచ్చిపోవాలి' అనుకుంటూనే బ్రతికేస్తానేమో కదా!

నిర్మానుష్యమైన ఓ ప్రదేశం చేరుకున్నాడు రామ్మూర్తి. కనుచూపుమేరలో ఎక్కడా 'జీవి' అంటూ కనిపించలేదు— ఏవో పక్షుల కిలకిలలు వినిపిస్తున్నా. రామ్మూర్తి ఓ పెద్ద బండరాయిమీద ఎక్కి నించున్నాడు. క్రింద భయంకరంగా పెద్ద అగాధం! ఇదే చావుకు అనువైన ప్రదేశం. ఇక్కడినుంచి దూకితే, భూమికి చేరుకోనే లోగా మార్గమధ్యంలోనే మరణించవచ్చు. తర్వాత తన తల వెయ్యి చెక్కలయిపోయినా తనకు ఇబ్బంది లేదు. ఈ ప్రపంచాన్ని విడిచి పెట్టేస్తున్నానని రామ్మూర్తికి ఓ మూల గుబులు కలిగింది. కళ్ళు తుడుచుకున్నాడు. "ఈ ప్రపంచంలో నేను మరి కష్టాలు పడలేను. నాకు విముక్తి కావాలి. సుఖం కావాలి ఓయి భగవంతుడా! నాకు ముక్తిని ప్రసాదించు!" అని దేవుడికి నమస్కారం పెట్టాడు. దూకబోయే వేళకు 'కిలకిల' మని వినిపించింది. రామ్మూర్తి వెనక్కి తిరిగి చూడగా చెట్టుమీద పంచరంగులరామచిలుక ఒకటి కనిపించింది.

"నువు నవ్వుతున్నావా - జాలి పడుతున్నావా?" అన్నాడు రామ్మూర్తి.

"నీమీద జాలి ఎందుకు? నిన్ను చూసి నవ్వుతున్నాను" అన్నది చిలుక.

"ఏడిశావ్—నువ్వు చిలకవయి పుట్టావు, మనిషివై పుట్టావు కాదు, తెలిసివుండేది."

చిలక సమాధానం చెప్పలేదు.

బండరాయిమీద నుంచి అగాధంలోకి రామ్మూర్తి దూకేశాడు! అవును — నిజంగానే రామ్మూర్తి చచ్చిపోయాడు! గుర్తుపట్టటానికి వీలు లేకుండా అతని కళేబరం ఛిన్నాభిన్నమై పోయింది!! ఇహలోకంలో కష్టాలు పడలేక రామ్మూర్తి 'ఆత్మహత్య' చేసుకున్నాడు. ఈ దృశ్యాన్ని చూస్తూ చెట్టుమీదవున్న చిలక, అనంతాకాశంలోకి రెక్కలు విప్పుకుంటూ ఎగిరిపోయింది!

మహాపాతకాల్లో ఆత్మహత్య ఒకటి. రామ్మూర్తి బండరాయిమీద నుంచి దూకుతున్న సమయంలో యమలోకంలోని కింకరులు అమాంతం భూలోకంలోకి

దూకి రామ్మూర్తి జీవాలను తాడు వేసి లాగేసు కున్నారు!

'ఎవరు మీరు?" అన్నాయి రామ్మూర్తి జీవాలు అమితాశ్చర్య పడుతూ.

'యమ కింకరులం" అన్నారు వాళ్ళు అతి భయంకరంగా నోరు తెరుస్తూ.

"అమ్మో" అన్నాడు రామ్మూర్తి.

"అమ్మా లేదు బొమ్మా లేదు-పద!" అని లాగాడు ఒక కింకరుడు కరకరమని పళ్ళు చప్పుడు చేస్తూ.

"నేను చచ్చిపోయాను కదూ!" అన్నాడు రామ్మూర్తి.

"నిరాక్షేపణీయంగా చచ్చావు."

"అమ్మయ్య! కష్టాల మలిన భూలోకం వొదిలి పోయింది. బట్టల అఫీసరూ వొదిలి పోయి వాడు. అప్పుల ముండా కొడుకులూ వొదిలిపోయినారు. "నేను స్వేచ్ఛాజీవిని - నేను స్వేచ్ఛాజీవిని!" అని కేకలు పెట్టాడు రామ్మూర్తి వెర్రిగా భోరుమని నవ్వుతూ, కింకరులు అభ్యంతర పెట్టలేదు. అతన్ని కొంతం నవ్వుకోనిచ్చారు.

భూలోకం వదిలి పోయిందనే సంతోషంలో రామ్మూర్తి ఉక్కిరి బిక్కిరయి పోయినాడు. ఆ సంతోషంలో అతనికి తల్లి గాని, భార్య గాని, బిడ్డలు గాని గుర్తురానే లేదు!

"ఇదేమిటిది - వైకుంఠమా?" అన్నాడు రామ్మూర్తి ఏదో కనిపించగా.

"నరకలోకం" అన్నారు కింకరులు.

"ఇక్కడ యమధర్మరాజుంటాడు గదూ!"

"అవును. రా, చూద్దువుగాని-"

రామ్మూర్తి యమధర్మరాజును కళ్ళారా చూశాడు. అతను నిజంగా యముడు లాగే వున్నాడు. ప్రక్కనే చిత్రగుప్తుడు 'చిఠా' ముందేసుకుని కూచుని, చేతి కలం ధరించి, ఏవో కాయితాల వంటివి పరిశీలిస్తున్నాడు.

"ఎవడు వీడు?" అన్నాడు యముడు, మీసం మెలివేస్తూ.

"రామ్మూర్తిని" అన్నాడు రామ్మూర్తి.

"నువ్వేంను. ఏం చిత్రగుప్తా!" అని గర్జించాడు యమధర్మరాజు.

"చిత్తం! ఇతను మహాపాపి!"

"నేనా? నే నేపాపమూ ఎరగను మహాప్రభూ!" అన్నాడు రామ్మూర్తి సవినయంగా.

"నువు ఇక్కడ కూడా అబద్ధం ఆడు తున్నావే. మా చిఠా అబద్ధం ఆడదు." అన్నాడు చిత్రగుప్తుడు సగర్వంగా.

"ఏం చేశాడు?" అన్నాడు యముడు.

"ఇతను ఆత్మహత్య చేసుకున్న మహా పాతకుడు!"

"ఆఁ! అయితే ఘోరశిక్షలు అనుభవించాల్సిందే. తీసుకుపొండి వీడిని!" అని గర్జించాడు యమధర్మరాజు.




చిత్రం: చెగుకూరి గురవయ్యనాయుడు—పాకాల.

రామ్మూర్తి నడుస్తూ నడుస్తూ నరకలోకం చూడసాగాడు ఒక మూల పాపుల్ని కత్తులతో పొడుస్తూంటే, ఇంకో మూల ముళ్ళతో రక్కుతున్నారు. మరోమూల నూనెలో వేపుతూవుంటే మరో చోట బండలు మోయిస్తున్నారు. ఇంకోచోట కుళ్ళు దొర్లింపిస్తూవుంటే వేరొకచోట మంటల్లో కాలుస్తున్నారు. అంతా భయంకరం! అంతటా హాహాకారాలు!!

"ఏమిటిది? నన్ను ఇట్లా చేస్తారా ఏమిటి కొంపదీసి" అన్నాడు రామ్మూర్తి ఏడుపు ముఖం పెట్టి.

"ఆహా! నువ్వు వీళ్ళకంటే నాలుగు ఆకులు ఎక్కువే చదివావు" అన్నాడు ఒక కింకరుడు.

"నన్నేం చెయ్యాలనీ?"

"రా. చూద్దువుగాని"

శూలాలు ఎర్రగా కాల్చి రామ్మూర్తి కోసమేనన్నట్టు నిరీక్షిస్తూ నించునివున్నాడు ఒకడు. రామ్మూర్తి రాగానే అతన్ని ఎగాదిగా చూసి ఎర్రగా కాల్చబడ్డ శూలాన్ని అతని గుండెల్లో గుచ్చి పైకి ఎత్తాడు. పైకి ఎత్తి సలసలకాగే నూనెలో ముంచి ఎర్రగా వేపి, బయటకుతీసి ఓమూల విసిరేశాడు! కాసేపటికి రామ్మూర్తికి స్పృహ కలిగింది. నెమ్మదిగా కళ్ళు తెరిచిచూసి ఒక్కసారిగా పెద్దగా కేక పెట్టాడు.

'నోరుమూసుకుని పోయి పడుకో" అని గర్జించాడు కింకరుడు. రామ్మూర్తి లేవలేక పోయినాడు. లేచేందుకు వొళ్ళు స్వాధీనంలో లేదు చూసుకోగా శరీరం అంతా కాలి పోయివున్నది. చేతులూ కాళ్ళూ బొబ్బ లెక్కిపోయివున్నై. ఒళ్ళంతా విపరీతంగా మండిపోతోంది. 'నాకెందు కీశిక్ష!' అని అరిచాడు రామ్మూర్తి పడుకుని. అతనికి సమాధానం చెప్పటానికెవ్వడూ అక్కడ కాచుకుని కూచోలేదు!

రామ్మూర్తి బాధతో వెర్రిగా కేకలు వేశాడు- బొబ్బలు పెట్టాడు- అరిచాడు!... ఎక్కడా ఏమీ సమాధానం లేదు అరిచిఅరిచి అలసిపోయి రామ్మూర్తి అట్లాగే సొమ్మసిల్లి పడిపోయాడు!

మర్నాడు కాబోలు, రామ్మూర్తి నిద్రలో వుండగానే ఒక కింకరుడువచ్చి త్రిశూలం అతని కడుపులోగుచ్చి పైకెత్తి చరచరా తీసుకెళ్ళి కణకణ లాడుతూవున్న పెద్ద నిప్పుల పొయ్యిలోదూర్చి, కాస్సేపు వుంచి, బయటకులాగి అక్కడే విసిరేసి వెళ్ళిపోయి నాడు రామ్మూర్తికి నోరువిప్పలేదు. చెయ్యి లేవలేదు. కాలుకదపలేదు దాహం- ఆకలి- మంట- బాధ! ఇవన్నీ ఎవరితో చెప్పుకో వాలో రామ్మూర్తికి అర్థంకాలేదు.

"ఓ భగవంతుడా! నా మొర వినవా!" అని ప్రార్థించాడు. అక్కడకూడా ఎవడూ అతని మొర ఆలకించలేదు

చాలా సేపటికి రామ్మూర్తికి వొళ్ళుమంట తగ్గింది నెమ్మదిగా లేచికూచుని అటూ ఇటూ చూశాడు. దూరంగా పహారాచేస్తున్న ఓ కింకరుడిని చూసి, ఛట్టున పడుకున్నాడు నిద్ర

(38-వ పేజీ చూడండి)

# ★ ముమూర్షు ★

(21-వ పేజీ తరువాయి)

పటించాడు. కాస్సేపటికి మళ్ళీ కళ్లు తెరిచాడు. కింకరుడు అక్కడే వున్నాడు. రామ్మూర్తి లేచి అక్కడికి వెళ్ళబోయినాడు కాని, వొంట్లో శక్తి లేదు—లేవటానికి ఓపికా లేదు.

"ఇదిగో" అన్నాడు రామ్మూర్తి నీరసంగా.

కింకరుడు పలకలేదు.

"కింకరుడు గారూ" అన్నాడు మళ్ళీ కాస్త హెచ్చుస్థాయిలో.

"ఏం?" అన్నాడు కింకరుడు అక్కడినుంచే.

"మాట."

కింకరుడు పర్వతం కదిలినట్టు నడిచివచ్చి, మ్రిగిచెట్టు నించున్నట్టు నిలబడి, "ఏం—ఏమిటది?" అని అడిగాడు గాలివాన వచ్చినట్టు.

"కాదు. నాకు...ఆకలి..." అన్నాడు రామ్మూర్తి నెమ్మదిగా.

"అయితే ఏం చెయ్యమంటావ్?"

"కాదు. తింటానికేమన్నా..."

"ఇక్కడేం దొరకదు"

"పోనీండి కాని—నన్నెందుకిట్లా బాధిస్తున్నారు?" అని అడిగాడు రామ్మూర్తి.

"పిచ్చివాడా! నువు ఆత్మహత్య చేసుకున్నావయ్యా. అది ఘోరపాపం కదూ! అందుకని పాపఫలం అనుభవిస్తున్నావు"

"ఆఁ!" అన్నాడు రామూర్తి ఆశ్చర్యంగా. "ఎన్నాళ్ళు?" అన్నాడు మళ్ళీ,

"చెప్పలేం—పాపం తీరేవరకూనూ"

"అన్నాళ్ళూ ఇట్లా బాధలు పడాల్సిందేనా?" అన్నాడు రామ్మూర్తి కళ్ళమ్మట నీళ్ళు కారగా.

"ఇంకా ఏం చూశావ్! ముందున్నది ముసళ్ళపండగ!" అనేసి సుడిగాలల్లే దూసుకుపోగా వెళ్ళిపోయినాడు కింకరుడు. రామ్మూర్తి ప్రాణాలు పైనే ఎగిరిపోయినై.

"ఓయి భగవంతుడా! నీవరకే నన్నీనరకంలో పారేశావుటయ్యా!" అనిఅరిచాడు... ఏడిచాడు......మొత్తుకున్నాడు...!

"భూలోకంలో కష్టాలుపడలేకపోయాను. అక్కడి బాధలు భరించలేకపోయాను. పరలోకంలో విముక్తి ప్రసాదించమన్నాను. ఓ దేవుడా! ఇదా నువు చేసిన నిర్వాకం! అక్కడి బాధలూ కష్టాలూ తాళలేక వస్తే—ఇక్కడింతకన్నా నరకబాధలు పెడుతున్నావా—" అన్నాడు రామ్మూర్తి భోరున. ఈ బాధలకన్నా భూలోకమే సుఖంగా వుంటుందనిపించింది అతనికి. సుఖపడదామని తను ఆలోకం వదిలిపెడితే జరిగింది ఇది! ఎక్కడికి వెళ్లినా తనకు ఈ బాధలు తప్పవా!... రామ్మూర్తికి బోధపడలేదు.

మరికొన్నాళ్లపాటు రామ్మూర్తి ఇట్లాగే నరకబాధలు అనుభవించాడు. అవి మరీ దారుణంగా దుర్భరంగా వున్నై. తనకష్టం చెప్పుకోటానికయినా ఎవరూ లేని లోకం అయిపోయింది. ఏం చెయ్యాలోనని రామ్మూర్తి రాత్రింబగళ్ళూ ఒకటే దీర్ఘాలోచన చేశాడు!

ఒకనాటి అర్ధరాత్రి రామ్మూర్తి లేచిచూడగా కింకరులంతా నిద్రపోతూ కనిపించారు. రామ్మూర్తి నెమ్మదిగా లేచి నించున్నాడు. అడుగులో అడుగు వేస్తూ కింకరుల్ని దాటి బయటకు వచ్చాడు. ఎక్కడా ఏ అలికిడీ లేదు — యమలోకం అంతా నిశ్శబ్దంగా వున్నది. రామ్మూర్తికి దివ్యమైన ఆలోచన కలిగింది. ఆలోకమే అనుకుంటే, దానికి మించిపోయి వున్నది ఈలోకం కష్టపెట్టటానికీ, ఏడిపించటానికీ. తను ఈ బాధలు మరి పడలేడు—ఎట్లాగన్నా ఈ లోకంనుంచీ, ఈ కింకరుల బారినుంచి తప్పించుకోవాలి — ఈ కష్టాలనుంచి బైటపడాలి — అని అటూ ఇటూ చూశాడు రామ్మూర్తి. యమసదనం ఎత్తుగా గంభీరంగా కనిపించింది. రామ్మూర్తి రెప్పవాల్చకుండా పైకి చూశాడు...అతని మొహంలో ఇన్నాళ్ళకు చిరునవ్వు కనిపించింది!—ఏదో ఊహ తట్టగా.

రామ్మూర్తి నిశ్శబ్దంగా ఆ భవన శిఖరానికి ఎగబ్రాకి పైననించున్నాడు. క్రింద అంతా పెద్ద అగాధంలాగా కనిపించింది. "ఓ దేవుడా! ఈ లోకంలో ఈ బాధలు మరి భరించలేను. నాకు ముక్తిని ప్రసాదించు, నాకు సుఖాన్ని కలిగించు!—" అని ప్రార్థించి, ఎత్తయిన ఆ భవన శిఖరంనుంచి దభాలున దూకేసి 'ఆత్మహత్య' చేసుకున్నాడు రామ్మూర్తి! ★

★ డిస్మెంసాల్
కుసుమ, బహిష్టునొప్పులకు
అద్భుతముగాపనిచేయును
వివరములకు — AGENTS
R.K.BROTHERS
4/27. RAJAHMUNDRY

# ★ తీరని కోరిక ★

(28-వ పేజీ తరువాయి)

పంకజం మౌనం తాల్చింది. "నీకు పిచ్చి ఎక్కుతోంది భాస్కరం. నీతోపాటు నీ భార్యను సేవనుకు ఇాగుకేనా తీసుకోవిరానిగా?"

"పంకజం! నన్ను మెలిపెట్టకు. మాటమలపకు. నువ్వు వాక్యమంతా ఉచ్చరించనక్కరలేదు. నీ ప్రేమించడం నిజం అయితే 'నిజం' అని రెండు అక్షరాలు అను చాలు! అబద్ధమయితే ఇంకొక అక్షరం ఎక్కువ 'అబదం' అను చాలు."

ఇంతలో రైలు మొదటిగంట మ్రోగింది. రైలు పెట్టెలోనుండి చంపకం గబగబా పంకజం కేసి నడిచివచ్చింది. "గంట మ్రోగింది. మేష్టారూ! నమస్తే! రా! అమ్మా" అని పిలిచింది తల్లిని. పంకజం, చంపకం రైలుపెట్టెలో ఎక్కారు.

"రైలుపెట్టెలో ఎక్కాం. మాష్టారూ! ఇంక బండికదిలేదాకా కబుర్లు చెప్పుకోవచ్చు. బండికదులుతుందేమోనని దిగివచ్చాను మాష్టారూ! క్షమించండి."

పంకజం అందుకుని ఇల్లా అంది "మీ మాష్టారికి, సంసారం గొడవతో పిచ్చెక్కిపోయింది. మనం దూరం వెళ్ళిపోతూంటే ఏవో పిచ్చాపాటి చెబుతున్నాడు పాపం! అవును కాని భాస్కరం! మీ శిష్యురాలిని జ్ఞాపకం ఉంచుకుని జాబులు వ్రాస్తూఉండు. ముందుగా అక్కడి చిరునామాతో చంపకమే వ్రాస్తుందిలే ఉత్తరం."

"అల్లాగే" అన్నాడు భాస్కరం.

"నీ పిల్లలకు ఏవైనా సీట్లు, ఉద్యోగాలు కావలసివస్తే వీళ్ల నాన్న సహాయం చేస్తారు. నీవంటే ఆయనకు చాలా యిష్టం. నీ మంచితనాన్ని గురించి ఎప్పుడూ నాతో చెబుతూ ఉంటారు" అంది పంకజం.

"అల్లాగే" అన్నాడు భాస్కరం.

"అల్లాగే కాదు. నిజంగా నీ కవసరం కలిగినప్పుడు వస్తే వారు సహాయం చేస్తారు. నిజంగా, రా."

బండి కదులుతోంది. బండిని అనుసరిస్తున్నాడు భాస్కరం. "దిగపడవోయి, ఇంకా బండి నడుస్తోంది. నిజంగా రావాలి నిజం చెప్పమన్నావుగా. నిజం చెబుతున్నాను. నిజం నిజం." నిజంగా ఒకరి కళ్ళలోకి ఒకరు చూసుకున్నారు, పంకజం ఆఖరి వాక్యాలు పలికేటప్పుడు.

ఆ చూపులు వ్యక్తం చేసినది నిజంగా ఇద్దరికీ అది తీరని కోరిక అనా?... ★